స్కెచ్

# బంధువర్గం

వల్లూరి కృష్ణారావు

విష్ణుమూర్తి 'హరీ' మనగానే సుభద్రమ్మా, సుభద్రమ్మ బ్రతుకూ వీధిని పడ్డాయి. గోడుగోడున ఏడ్చింది తననూ, తన పిల్లల్నీ అన్యాయంచేసి 'ఆయన' వెళ్ళిపోయారని. ఊరందరూ చేరారు ఇంటిముందు. విష్ణుమూర్తికి, సుభద్రమ్మకు కావలసిన బంధువులందరకూ అర్జంటు కబుర్లు పంపారు. సుభద్రమ్మ హృదయ విదారకంగా ఏడుస్తోంది. పాపం! అన్నారు. నారాయణా! నారాయణా! అని స్మరించారు జాలిగా చుట్టూ మూగిన కాకి మూకంతా! వీధిచూసి ఎరగని సుభద్రమ్మ వీధిని పడిందన్నారు. నల్లరాయి పగిలిందన్నారు. ఇంతకీ పిల్లలు దురదృష్టవంతులన్నారు. సుభద్రమ్మకు చెడ్డరోజులన్నారు. విష్ణుమూర్తి మంచితనాన్ని వివరించి చెప్పుకున్నారు. విష్ణుమూర్తి అంత మంచివాడు ఆ గ్రామంలో మరెవ్వరూ లేనట్లుగానే చెప్పుకున్నారు. సుభద్రమ్మకు ఇదేం పట్టలేదు ఏడుస్తోంది. కంఠం జీరపోయిందికూడా పాపం. పిల్లలు ఘొల్లుమన్నారు సుభద్రమ్మ ఏడుపు చూచి. పాపం చంటీ లెంటీ! ఒక ముసలిముత్తయిదువ ఓదారుస్తూ అంది:

"ఊరుకో సుభద్రమ్మా! ఊరుకో! ఇంక పిల్లల్ని చూసి బ్రతకాల్సిందే! నీరాత ఇలా బ్రద్దలయింది!"

"నేనింక ఎలా బ్రతకనని" ఆ ముసలి ముత్తయిదువ మెడకు చేతులు పెనవేసింది. ఆ ముత్తయిదువ నుదుటనున్న రూపాయి బిళ్ళంత కుంకుమ సుభద్రమ్మను కొట్టొచ్చేలా చూసింది.

"ఇదుగో! నువ్వు ఇలా అయితే లాభంలేదు. పిల్లలు ఎలా అయిపోతారో చూడు" ఇంకో ఆవిడ వెనకనుంచి అంది.

• • •

కావలసిన వాళ్ళంతా వచ్చారు ఆ సాయంత్రానికి. సుభద్రమ్మ ఘోడుఘోడున ఏడుస్తూనే ఉంది. "సుభద్రమ్మ పాపం ఈ సంసారాన్నంతా ఈదాలి" అన్నారు. "గుట్టుగా బ్రతికిన సంసారం వీధిని బడింది" అన్నారుకూడా. వీధినిబడ్డ సుభద్రమ్మను లోపలికి తీసుకు రావడానికి అంతా ముందుకొచ్చారు.

"నీకొచ్చిన భయమేమీ లేదు సుభద్రమ్మా, ఇంతో అంతో వెనకేసి పోయాడుగాని నిన్ను బొత్తిగా నిట్రాడు కట్టినా ఉంచలేదుకదా విష్ణువు" అన్నాడు రామ్మూర్తి ఓదారుస్తూ.

"తిండికోసం కాదు అన్నయ్యా...ఆయన లేని లోటు ఎన్నిఉన్నా లోటే" అంది నింపాదిగా సుభద్రమ్మ ఏడుపు ఆపి. రామ్మూర్తి గతుక్కుమన్నాడు. ప్రతీ విషయమునూ డబ్బుతో కొలచి మాట్లాడుతాడు. 'లిటిగేషన్' ఆయన 'హాబీ.' విష్ణుమూర్తి మేనమామ ఆంజనేయులు పరామర్శించడానికి వచ్చాడు. సుభద్రమ్మ కళ్ళనీళ్ళు కుక్కుకుంది.

"విష్ణుమూర్తికి యింత అర్థాంతరపు చావు వస్తుందని నేననుకోలేదు. పాపం అయినా అమ్మాయీ ఇటుచూడు! మనం పోయినవాళ్ళతో ఎలానూ పోలేము నీకొచ్చిన లోటులేదు. ఎటొచ్చీ విష్ణువే లేకపోయాడు. ఈ పిల్లలతో సంసారం బహు జాగ్రత్తగా ఈదాలి. అసలే దిక్కుమాలిన రోజులు. లోకులు కాకులు అన్నారు!" ఇంకా ఏదేదో చెప్పుకుపోతున్నాడు. ఒకదారిని నడవ్వు ఆంజనేయులు మాటలు. సుభద్రమ్మను బలవంతంగా మామూలు ప్రపంచంలోకి తీసుకువస్తున్నారు. సుభద్రమ్మను ఓదార్చడానికి వచ్చిన పెద్దలంతా ఏవో అర్థాలు స్ఫురింపచేస్తూ మాట్లాడుతున్నారు. వారి మాటల సందర్భాలను తెలుసుకోలేనంత అర్భకురాలుగాదు సుభద్రమ్మ.

సుభద్రమ్మ అన్న వీరభద్రం వచ్చాడు. సముదాయించడానికి గాను ఏవో మాటలు చెప్పాడు. అవి ఊరడించడం పోగా మరి కొంత కష్టపెట్టాయి!

"చూడు అమ్మాయీ! బావ పోవడం నిజంగా మాయగానే వుందిగాని నిజం అనిపించటంలేదు!

నిజంగా నాకు మాత్రం ఎవరున్నారు గనక! తమ్ముడి సంగతి నీకు తెలుసు కదా! తాగుబోతు వెధవ! పట్టి జూదరి. ఎంత డబ్బూ చాలడంలేదు. ఏదో ఒక ఇంటివాణ్ణిచేసి ఔను అనిపించుకుందా మంటే నాకు తరం కావడం లేదనుకో! నా పరువు ప్రతిష్ఠలు గంగలో కలుపుతున్నాడు. నీ కొచ్చిన భయం లేదమ్మాయి. ఊరికే బెంగపెట్టుకోకు. లక్ష్మిని నీ కోడలుగా చేసుకో!..."

సుభద్రమ్మకు మతి పోయేలా ఉందికూడా! ఇంకా పక్షిణీ రోజులు పోకుండానే తన కొడుక్కి పెళ్ళిమాటలా? "ఏమిటండీ ఈ అన్యాయం!" అని భర్త ఫోటోకేసి చూస్తూ ఏడ్చింది.

కర్మకాండలు యథావిధిగా జరిగాయి. అందరి మాటలూ సుభద్రమ్మ విన్నదేగాని ఎటువంటి సమాధానమూ ఎవ్వరికీ ఇవ్వలేదు. అందరూ ఆశ్చర్య పోయారు.

సుభద్రమ్మను ఆదుకోవడానికి వచ్చిన కావలసిన వాళ్ళంతా ఈసారికి వెళ్ళవచ్చు. అలా జరగలేదు. పదమూడోరోజు రాత్రిబండికి సుభద్రమ్మ తమ్ముడు సత్యమూర్తి వచ్చాడు. సత్యమూర్తి అంటే అందరికీ లోపల భయం. పైకి అసహ్యం.

సత్యమూర్తి చాలా నిండైన విగ్రహం. దేన్ని గూర్చి పట్టించుకోని మనస్తత్వం! సత్యమూర్తి సరాసరి సుభద్రమ్మ గదిలోకి వెళ్ళాడు. సుభద్రమ్మ పెద్దపెట్టున రాగాలు తీసింది తమ్ముణ్ణిచూసి. ఏడుస్తూనే అంది.

"మీరుండగా రాని వాళ్లుకూడా ఇప్పుడు వస్తున్నారండీ!" సత్యమూర్తి అర్థం చేసుకున్నాడు ఆ మాటలపోటు. చాలా బాధపడ్డాడు.

"అవును అమ్మాయీ! నాకు గౌరవంలేదు. గౌరవంలేని నాబోటి తాగుబోతు, జూదరి, గౌరవంగల మీలాటివారి యిళ్ళకు రావడం ఏ విధంగానూ మంచిది కాదమ్మా. ఇప్పుడుకూడా రాకపోదును. కానీ—కాని...నిన్ను చూడకుండా ఉండలేకపోయాను."

సుభద్రమ్మ బావురుమంది. నోట్లో గుడ్డ కుక్కుకుంది. ఖంగుమని గలగలలాడుతూ వస్తున్న ఏడుపును ఆపలేకపోయింది. తలకాయను నేలకేసి కొట్టుకోవాలనిపించింది.

"నాకు మతిపోయింది తమ్ముడూ! నేనేం మాట్లాడుతున్నానో నాకు తెలియకుండా వుంది. నువ్వెప్పుడూ నాకు తమ్ముడువే!" అంది. సత్యమూర్తి కరిగిపోయాడు. కళ్ళలో నీళ్లు నిల్చాయి సత్యమూర్తికి మొదటిసారిగా.

"అమ్మాయీ! బాధపడకమ్మా. కష్టాలు వస్తాయి అప్పుడే ధైర్యంగా ఉండాలి. భవిష్యత్తుకోసం చెపుతున్నానమ్మా. ఎవర్నీ నమ్మకు. వస్తాను."

"వద్దు తమ్ముడూ. రేపు వెడుదువుగాని" అంది ఎంతో అప్యాయంగా. ఆమె ఎవరి మాటలూ ఇంత శ్రద్ధగా వినలేదు, ఇంత యిదిగా మాట్లాడలేదు.

"కాదమ్మాయీ!"

"నామాట కాదనకు తమ్ముడూ!"

సత్యమూర్తి ఆగిపోయాడు. సత్యమూర్తి హాలులోకి రాగానే అంతా చెల్లాచెదరవుతున్నారు ఖంగారుగా! సత్యమూర్తి ఫకాలున నవ్వాడు. ఆ నవ్వు చాలా భయంకరంగా అందరిచెవుల్లోనూ రింగుమని తిరిగింది. నవ్వుతూ అన్నాడు—

"నే తాగి రాలేదు!"

మరీ కంపించారు అంతా! సాధ్యమైనంతవరకూ సత్యమూర్తికి ఎదురు కడకండా ఉండడానికి జాగ్రత్తపడుతున్నారు. వీరభద్రం మండిపడుతూ "విచక్షణ తెలియని పశువు. బావ పోయాడని విచారం లేకపోగా ఉరుములా నవ్వుతున్నావు తాగుబోతు వెధవా!"

సత్యమూర్తి కళ్లు జ్యోతుల్లా కణకణలాడాయి. ఇంకోహ డామాటలంటే పొట్టచీల్చి ఎముకల్ని ఏరి పారేసి లెక్కబెట్టుకోమని ఉండేవాడు. కాని ఆన్న! వీరభద్రం కళ్ళలోకి పొడిచి చూసాడు. వీరభద్రంకూడా వాడలిపోతూ కుదించుకు పోయాడు. వీరభద్రానికి తెల్సు. సత్యమూర్తికి ఎప్పుడోగాని కోపంరాదు! తాగినా చాలా జాగ్రత్తలో ఉంటాడు. అలాటిది కోపంవస్తే పిడుగుల్ని విసురుతాడు! వీరభద్రానికి దారి దొరకలేదు సత్యమూర్తి నుండి తప్పించుకోడానికి. సత్యమూర్తి చురచుర చూపులు ముళ్ళకుడుతున్నాయి వీరభద్రాన్ని. అంతా రాపడి చూస్తున్నారు. సత్యమూర్తి కఠినంగా చెప్తున్నట్లు అన్నాడు పళ్ళుబిగించి:

“విచక్షణ తెలియనిది ఎవరికి? నీకా? నాకా? పదిరోజులు పోకుండానే కూతురు పెళ్ళిమాటలకు వచ్చిన నీకా? నాకా? తోబుట్టువు సొమ్ము ఆశించడం కుక్కకన్నా హీనం అని మర్చిపోకు.”

వీరభద్రం కోపంతో ఉడికిపోయాడు. జేవురించిన మొహంతో వీధినిబడ్డాడు. మళ్ళా తిరిగి రాలేదు. వీరభద్రం వెళ్ళిపోవడంతో అంతా జారుకున్నారు క్రమంగా.

“అమ్మాయీ! అంతా వెళ్ళిపోయారనా అలా చూస్తున్నావు? లేక నేను... సరేలే. పెద్ద ఆస్తిటమ్మా ఇంకొకారు చూడ్డానికి? నువ్వు పదెకరాలుచూసుకోలేని అర్భకురాలవని నేను అనుకోను. ఊళ్ళో హైస్కూలుంది పిల్లవాని చదువుకు. నీకొచ్చిన ఇబ్బందేమీలేదు. ఎవర్నీ చేరదియ్యకు, నన్నుకూడా!”

“తమ్ముడూ!” ఎంతో ఆదరంగా అంది. “వస్తానమ్మా” అంటూ వెళ్ళిపోయాడు సత్యమూర్తి వీధిలోకి. సత్యమూర్తి పోయినవైపు చూస్తూ చాలాసేపు గుమ్మంలో ఉండిపోయింది సుభద్రమ్మ!

---

స్కెచ్

# కల్యాణి నవ్వుకుంది

“ప్రఫుల్ల”

ఎదురుగుండావున్న నిలువుటద్దంలో తన రూపం ఓసారి చూసుకుంది కల్యాణి. తనకే అసహ్యమనిపించింది. తనేం పాపం చేసింది? ఎందుకు దేవుడు తనను ఇలా సృష్టించాలి? తనపాటి తెలివితేటలున్న అమ్మాయి ఏ యువక హృదయాన్ని కుతకుత లాడించదు? ఏం ప్రయోజనం? జీవితం చాలిద్దామన్న ఆలోచన, ఆత్మహత్య కర్తవ్యమన్న వూహ, లోగడ చాలసార్లు కలిగాయి. కానీ, జీవితంలో అందమేనా ప్రధానమని జీవిస్తూంది.

కల్యాణి ఎంతో మంచి అమ్మాయి. అసలు కల్యాణికి తను మంచి పిల్లనిపించుకోడంలో ఏపాటి కష్టమూ అనిపించలేదు. ఆ మాటకొస్తే అలా అనిపించుకోడం తప్ప వేరే మార్గంకూడా లేదాయె. కల్యాణి వయస్సు పద్ధెనిమిదేళ్లు; కాని చూడ్డానికి ఏ ఇరవై ఎనిమిదో ముప్పైయో వున్నట్టు కనిపించేది. కాగా, కల్యాణికూడా చాల పెద్దవాళ్ళలాగే ప్రవర్తించేది. పొట్టిగా కొంచెం బొద్దుగా వుండేది. ఆమె నల్లటి కోలముఖాన్ని ఆ స్ఫోటకం మచ్చలు కసిదీరా పాడుచేశాయి. ఆ బంగారు కళ్ళద్దాల ఫ్రేము శరీర వర్ణాన్ని మరీ అసహ్యంగా ప్రదర్శిస్తూ వుంటుంది. కల్యాణి తలకట్టుకూడా కురుచగా ఉంటుంది. దానికి తోడు కల్యాణి మరీ ఎక్కువగా నూనె పట్టించి మాడుకు అతుక్కుపోయేట్టు దువ్వేది. శరీరంలో వంపులసలు లేవు.

కాని, ఈ వికృతాకారాన్ని కప్పిపుచ్చడంలో కల్యాణి తెలివితేటలు చాలా పనిచేశాయి. క్లాసులో కల్యాణి ఫస్టు. ఆమె చాలా కష్టపడి చదివేది. ఆ విపరీత శ్రమను ఆ కళ్ళద్దాలే తెలియజేసేవి. తల్లిదండ్రులకు ఎప్పుడూ ఆమె భారమనిపించలేదు. తెల్లారిలేచి యింటిపనులన్నీ చక్కగా చేసి మరీ సైకిలుమీద కాలేజీకి వెళ్ళేది. కాలేజీలో చెప్పే విషయాలు శ్రద్ధగా మననంచేసుకొని యింటికొచ్చేది. అనవసర విషయాల్లో జోక్యం చేసుకునేదికాదు. కల్యాణిని ఒకరు ప్రేమించలేదు; ఆమె ప్రేమకోసం అర్రులు చాచలేదు.

సరికొత్త ఫాషన్లపై కల్యాణికి ఆసక్తిలేదు. కాలేజీ కుర్రాళ్ళతో మాట్లాడిందిలేదు. ఎగతాళి చేస్తారని సాధ్యమైనంతవరకూ తప్పించు తిరిగేది. దేవుడిచ్చిన అందంతోనే తృప్తిపడాలనీ, స్నోలు, పౌడర్లూ తనకోసంకాదనీ కల్యాణి ఏనాడో తెలుసుకుంది. దయ, కారుణ్యం మానవజాతి ప్రథమ లక్షణాలని ఆమె విశ్వాసం. ఫలంకోసం ఆశపడకుండా కష్టపడడం చాలా ముఖ్యమని ఆమె ధృఢ నమ్మకం. కల్యాణికి తన యీడు స్నేహితులు లేరనే చెప్ప